నిరసన గీతాలు

"అమ్మా! అమ్మా! ఒక్క బిందె చాలు. ఇంట్లో చాలా గా నీళ్లులేవు. కొంచెం బిందె తియ్యమ్మా."

"ఇందాకటినించి కూచున్నా, నిండి చస్తేనా! సన్నగా పడుతున్నాయి. నా రెండు బిందెలు నిండితే ఇక ఇటు తిరిగి చూసేది లేదు."

"అయ్యో రామ! ఆయన అవతల కోర్టుకి వెళ్లాలమ్మా! మాఅమ్మవిగా, కొంచెం పట్టనిద్దూ!" ప్రాధేయపడింది కామాక్షమ్మ.

"నాకు మాత్రం తొందర లేదూ! మాకేమన్నా గంగాళాలు, గాబులు ఉంటే ఒకేసారి నింపుకుందుము, మళ్లీ రాకుండా." సాగదీస్తూ సమాధానం చెప్పింది పక్కింటావిడ.

"ఏమండోయ్, పిన్నిగారూ! మీకంటే అరగంట ముందర వచ్చా. అవిగో చూశారా, ఎట్లా అహోరిస్తున్నాయో మా బిందెలు." తనకంటే ముందుగా పడుతుందేమో అన్న భయంతో అదుర్దాగా అన్నది ఎదురింటావిడ కామాక్షమ్మను ఉద్దేశించి.

"నువ్వు ఎందుకైందే, తల్లీ, మా మనమరాలు, ఆ కొత్తగా వచ్చిన ఆమె ఒకసారేగా పంపు దగ్గిర వేసింది బిందెలు! ఇంతలో ఈమె వచ్చిందాయె. అమ్మాయ్! నన్ను కొంచెం ఒళ్లు తడుపుకోనియ్యమ్మా. పుణ్యం ఉంటుంది. ఆ బిందె అటు జరుపుదూ. పెంద రాళే మడి కట్టుకోంది తెమలదే!" పాత చీరతో స్నానానికి వచ్చిన బామ్మగారు చిన్న ఉపన్యాసం ఇచ్చి అర్థించింది.

"ఇదిగో, అమ్మాయ్! ఆ బట్టలు అవతల ఉసువుకొరాదూ? మా బిందెల్లో పడుతున్నయ్." నీళ్ల కోసం నిరీక్షిస్తున్న ఒకామె కోపం.

"నన్నేం చెయ్యమంటారు? మాకేం స్పెషల్‌గా బాత్ రూములు లేవు. కష్టంగా ఉంటే ఇంటాయనతో చెప్పండి, ఇంకో బాత్ రూం కట్టించమని." పంపు దగ్గిర బట్టలు ఉసుముతున్న పిల్ల సమాధానం.

"ఆ పిల్లని అని ప్రయోజనమేమిటి? వాళ్లకి ఉండాలిగాని. అందరికి కలిపి అది ఒక్కటే బాత్‌రూం. ఫస్టు వచ్చేప్పటికి మాత్రం ముద్దరు ముడుపుగా చెల్లించాలి." నిస్పృహతో తనలో తానే అనుకొన్నది ఒకామె.

చిత్రం — కె. రవిలోచన్ (కర్నూలు)

ఆంధ్రప్రభ

గురునాథంగారు

"చెపుతూంటే అంత ఇది కూడా లేకపోతే ఎట్లా నమ్మా? నిండాకాకపోతే పోయె.సగమైనా పట్టనియ్." బిందెతో బిందెను నెట్టి పంపు కిందికి తన బిందె చేర్చింది కామాక్షమ్మ.

"అదేమిటండీ పూర్తిగా నిండందే..."; "అమ్మాయ్, పెద్ద ముండని నిలబడలేనే, చప్పున అవతల పడతా?"; "ఏమండోయ్ నే నిట్లానే నిలబడాలా?"; "ఈ నీళ్లతో వచ్చిందమ్మా ప్రాణానికి!" — నీళ్లకు వచ్చిన కంఠాలన్ని ఒక్కుమ్మడిగా రొదపెట్టాయి పంపు దగ్గిర.

అవును మరి! టైము ప్రకారం వచ్చే పంపులు. సమయానికి నీళ్లు పట్టకపోతే తరవాత గుక్కెడు నీళ్లు కూడా దొరకవు. అందరికి ఒకే సమయం. ఆఫీసువేళ, పనివేళ, ఉన్నది ఒక్కగా రొక్క పంపు,ఒక్క బాత్‌రూమ్. ఇళ్లు దొరకక నెలల అడ్వాన్సుతో అద్దెకు వచ్చేవాళ్లు ఉండగా అన్ని సౌకర్యాలు చూసే అవసరం ఇంటివాడికి ఏముంటుంది? మరి తప్పెవరిది? ఒకరిపై మరొకరి ఈసడింపులు సహజం అవుతాయి.

"ఏమేవ్!ఎక్కడున్నావ్? కాసిని కాఫీనీళ్లు నా మొహాన పోస్తే గొంతు తడుపుకుంటా." ఆలస్యం అయినందుకు కోపం, అభ్యర్థన మిళితం చేసి, భార్య కామాక్షమ్మను ఉద్దేశించి కేకవేశాడు గురునాథంగారు.

"ఇల్లెగిరి పోయేను! ఎందుకలాగ అరుస్తారు? నీళ్ల కోసం వెళ్లాను. అక్కడ ఒక పెద్ద రామాయణం. మీ పనులు కానీయండి, ఇప్పుడే తెచ్చి ఇస్తా."

"ఒరే! గోపీ,. . . . . రాధా . . . . చిట్టీ. . . ఎవరు పలకరేంరా?" పిలిచాడు గురునాథంగారు.

"ఏమిటి, నాన్నా?"

"ఇందులో బ్లేడు ఎవరు తీశారు?"

". . . . . ."

"మాట్లాడవేంరా?"

"నేనే."

"ఎందుకు?"

"పెన్సిలు చెక్కేందుకు."

"ఛ! బండ వెధవ. బుద్ధి లేదు. . . . ఇంకా నిలబడ తావే, బ్లేడు ఒకటి తీసుకురా"

"డబ్బులో?"

"రాసుకోమనవోయ్, నెలాఖరుకి ఇద్దాం. అణా బ్లేడుకి కూడా అప్పు! వెధవ బ్రతుకు." తనను తానే తిట్టుకున్నాడు గురునాథంగారు.

"ఎందుకండీ విసుక్కుంటారు?" కాఫీ అందిస్తూ అన్నది కామాక్షమ్మగారు.

"కన్నావు సుపుత్రుణ్ణి. కొత్త బ్లేడుతో పెన్సిలు చెక్కాడు. ఛ! ఇదేమిటి, కాఫీలో పంచదార వెయ్యలా?"

"ఎక్కడిదండీ, కంట్రోలురేటుకు తెచ్చింది అయి పోయిందిగా. అప్పు చేస్తే ఎక్కువ వేసుకుంటాడు, వద్దని మీరేగా చెప్పింది. బెల్లం వేశా."

"అఘోరించలేకపోయావు."

"నన్నేం చెయ్యమంటారు. నే రొక్కదాన్నే మింగు తున్నానా.నలుగురు ఉన్నచోట ఖర్చుకాక ఏమౌతుంది?"

గురునాథంగారు

నాథంగారు నీ వెంట వెళుతూంటే, ఎంతమందిలో నయినా ప్రత్యేకంగా కనిపిస్తారంటే విశేషం ఏముంది?

గురునాథంగారి తండ్రి సంపాదించి ఇచ్చిన మూడెకరాల మాగాణిలోను రెండుంపాతిక పెద్ద పిల్లల పెళ్లిళ్ల కోసం ఖర్చయి పోయింది. వచ్చే తిండిగింజలు నాలుగు నెలలకు కష్టంగా సరిపోతాయి. అదీ మక్తాలవారి దయపై ఆధారపడి ఉంటుంది. హైకోర్టు వరండాలో జాబువర్కు, లాయరుగారి వద్ద పార్టు టైమ్ ఉద్యోగం, పింఛను రాళ్ళు, ఊళ్లో సొంత ఇంటిపై వచ్చే రెండు సదుల అద్దె డబ్బులు— ఇవి గురునాథంగారి ఆదాయం. వ్యయం మాట గురునాథంగారి విషయంలో ఆలోచించే పనిలేదు. ఎన్ని ముళ్ళు వేసినా అది ఎప్పుడు అదాయంకంటె మొగ్గుగానే ఉంటుంది.

"ఏమండోయ్! ఈనేళ శనివారం. అమ్మాయి, నేను గుళ్లోకి వెళతాం." భర్తకు అర్జీ పెట్టుకుంది కామాక్షమ్మగారు.

"వెళ్లండి. నాకు చెప్పేదేముంది."

"కాదండి, టెంకాయి, బస్సు ఛార్జీలు వగైరాలకు చిల్లర డబ్బులు కావాలి."

"దేవుడు లేదు, దయ్యం లేదు. ఇంట్లో కూలబడండే. మనస్సులో ఉంటే చాలు. ఇంట్లో లేడు దేవుడు? నాదగ్గిర నయాపైసా లేదు." కోపాన్ని వ్యక్త పరిచారు గురునాథంగారు. డబ్బు లేకపోతే కోపం రాకేం చేస్తుంది? నెలాఖరుకు వచ్చే డబ్బులు ఇంటి ఖర్చులకు సరిపోవడమే అంతంత మాత్రం. జాబ్ వర్కులో ఏమన్నా వస్తే, కూరగాయలు ఇత్యాది రోజువారీ వెచ్చాలకు సరి. అదిన్నీగాక ఈమధ్య దేవుడు రేట్లు కూడా పెరిగినవాయె! టెంకాయ కొడితే టిక్కెట్టు, అష్టోత్తరానికి ఒక రేటు, ఆకుపూజకు ఒక రేటు. హారతి ఇవ్వాలంటే మరో రేటు. ఈ విధంగా ప్రతి శనివారం ఏదో ఒకటి అయితే ఆరోజు గురునాథంగారి ఇంట్లో ఏకాదశే. గురునాథంగారికి అవన్నీ అందుబాటులో ఉండద్దూ?

"నాన్నా, స్కూలు ఫీజు కట్టాలి." గురునాథంగారి మూడవ కూతురు మెల్లిగా అడిగింది.

'నెలాఖరుకు కడదాంలే అమ్మా."

"ఫైనుతో ఆఖరు తేదీ రేపే, నాన్నా."

"నాన్నా, స్కూలు యూనిఫారం లేదని టీచరు క్లాసునించి పంపించేసింది." నాలుగవ కూతురు తన బాధ తండ్రికి మొరపెట్టుకుంది.

"అబ్బ! కడతాను లేవే. నేను రేపు మీ టీచర్ని కలుస్తాలే. నువ్వు బడికి పో."

"ఏమండోయ్! కందిపప్పు నిండుకున్నది. మిరప కాయలు రెండు రోజులకంటే ఎక్కువ రావు."

"అబ్బ! చంపుకు తింటున్నారు. తెస్తాలే" అంటూ కోర్టుకు బయలుదేరాడు గురునాథంగారు.

"అన్నట్లు మరిచిపోయాను, అమ్మాయిని చూచేందుకు గుంటూరువాళ్ళు వస్తారన్నారు కదండి? సాయంత్రం పెందరాళే వచ్చేయండి. వచ్చేటప్పుడు కాసిని మల్లెపూలు, ఏదైనా కాస్త ఫలహారం తీసుకురండి. వట్టి కాఫీ ఇస్తే బాగుండదు. మరిచిపోకండి." వెళుతున్న భర్త వీపుమీదికి విసిరింది మాటలు.

సాయంత్రం కోర్టునుండి తిరిగి వచ్చిన గురునాథంగారికి ఆరోజు ఇల్లు సందడిగా ఉన్నదని అనిపించింది. "నాన్నా, పెద్దక్కయ్య, బావ వచ్చారు." కబురు చల్లగా చేరవేశాడు, గురునాథంగారికి కుమారుడు. ఆయనకు పచ్చి వెలక్కాయ నోట్లో! వాళ్ళు మళ్లీ వెళ్లిందాకా పాల డబ్బాలు వగైరా ఖర్చులు బోలెడు. ఇంటికి పెద్ద అల్లుడాయె. అంతదూరంనుండి సిటీలో వింతలు, విశేషాలు చూద్దామని వచ్చాడు. కనీసం నాలుగు రోజులైనా సెలవు పెట్టి వెంట తిరగకపోతే సబబుగా ఉంటుందా! గురునాథంగారికి నస్యం పట్టుకు నయాపైసా మిగలదు. హైదరాబాదు వంటి సిటీలో ఒకరికి ఇద్దరు ముగ్గురు తోడై అక్కడ, ఇక్కడ తిరగాలంటే బస్సు ఛార్జీలు, రిక్షా ఛార్జీలు, దారి భత్యాలు, ఒకటేమిటి అనేకం!

పెళ్లి చూపుల తంతు అంతా ఏర్పాటు చేసింది కామాక్షమ్మగారు. అనుకున్నట్లు పిల్లవాడి తరపువారు వచ్చి కాఫీ ఫలహారాలు సేవించారు. ఎందుకైనా మంచిదని గురునాథంగారు పెళ్లి ఈడుకు వచ్చిన నాలుగవ పిల్లనుకూడా మూడవ పిల్లతోపాటు చూపించారు. చూచేందుకు వచ్చిన పెద్దలు ఆడపిల్లల్ని ఇద్దర్ని శల్య పరీక్ష చేశారు. పాటలు పాడించారు, నడిపించారు, లేవమన్నారు, కూర్చోమన్నారు. "ఏం చదువుతున్నావు? పేరేమిటి?. . . . . ." ఇత్యాది అనంతకోటి ప్రశ్నలు. మొత్తంమీద గురునాథంగారి కుమార్తెలకు ఫిజికల్, ఓరల్, మెంటల్ ఎగ్జామినేషన్సు పూర్తి అయినవన్న మాట! "సరే! మేం సెలవు పుచ్చుకుంటా" మంటూ పెళ్లిచూపులవాళ్లు బయలుదేరారు. బస్సుదాకా సాగనంపేందుకు రామదూతలా బయలుదేరారు గురునాథంగారు. "అయ్యా! గురునాథంగారూ! పిల్లల్ని చూచాం. నచ్చింది లేంది ఇంటికి వెళ్లి అందర్ని విచారించి, పోస్టు డబ్బాలో కార్డుముక్క పడేస్తాం. ఏది ఎలా ఉన్నప్పటికీ.... మీతో ముందుగా చెప్పడం మంచిదని చెబుతున్నాను. మా పెద్దబ్బాయికి రెండువేల అయిదు వందలు ఇచ్చారు. సరే, లాంఛనాలు వగైరా వేరే. దానికి నే చెప్పేది ఏముంది? అదీ సంగతి. ఇక మీరు ఉండండి." పెండ్లి కుమారుడి తండ్రి నింపాదిగా సెలవిచ్చారు గురునాథంగారికి. ఇంకేం సెలవు? ఒకటే సెలవు! గురునాథంగారు గుడ్లు అప్పగించారు. "చచ్చు పీనుగులు! వీళ్లకే వేలు గుమ్మరిస్తే మిగిలిన వాళ్లేం కావాలి? ఉన్న పొలం ఇల్లు అమ్మి నేనేం ముష్టెత్తుకోవాలా? ఉన్న ఒక్క మగనలుసుకు చదువు సంధ్యలు చెప్పించుకోవద్దూ? కట్నాలతోనే మేడ కడదామనుకుంటారు ఆశ పాతకులు!" దండకంతో గుమ్మంలో అడుగు పెట్టారు గురునాథంగారు.

"ఏమన్నారు,నాన్నా?" పెద్దమ్మాయి ప్రశ్నించింది.

"నా. ...త...ల...కా...య...న్నా...రు." కోపంతో దీర్ఘం తీశాడు గురునాథంగారు.

"ఏమండోయ్! మీకోసమే చూస్తున్నా. మీరు అట్లా వెళ్లారు, ఇంతలోనే రాధ ....." అవతల అల్లుడుగారికి వినిపించకుండా గురునాథం గారికి వార్త చెప్పింది మెల్లిగా భార్య కామాక్షమ్మ.

గోవిందో హారి! కుప్పలా కూలబడి పోయారు. అయిదు నిమిషాల వరకు గురునాథంగారి నోట మాట రాలేదు.

"అయ్యో! అదేమిటండీ, తప్పుతుందా! కొట్లో కొబ్బరి, బెల్లం, ఓ పాతిక అరిటిపళ్లు తీసుకురండి. నలుగుర్ని పిలిచి కాస్త చిమ్మిలి తొక్కించి తేలికగా అయిపోయిందనిపిద్దాము."

నిజమే! తప్పుతుందా గురునాథం గారికి! పెద్ద పిల్లల పెళ్లికే ఉన్న పొలం మూడువంతులు అమ్మాడు. ఇప్పుడు ఉన్న పిల్లల కోసం ఏవేవి అమ్మాలో? దానికి తోడు అయిదవ పిల్లకూడా పెండ్లికి సిద్ధం. జారి గుండె గలవారు గురునాథంగారిని తలచుకుని జారి పడడం కంటే చేయగలిగింది ఏముంది? దేశంలో ఇలాంటి గురునాథంగారులు ఎంతమందో! ఎన్ని ప్రణాళికలయితే వీళ్ల సమస్యలు సరిష్కారం అవుతాయి! ★

జలపుష్పాలు

ఫోటో—డి. ఎన్. బాబా (మచిరీపట్నం)